ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 27-01-2026 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వచ్చే నెల 11వ తేదీన పోలింగ్ జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు.
2. ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.
3. భారత పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలో రేపటి నుంచి నాలుగు రోజుల పాటు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో “వింగ్స్ ఇండియా 2026” ప్రదర్శన జరగనుంది.
4. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాల్లో కాంగ్రెస్ నేతల పాత్రపై విచారణ జరిపించాలంటూ బీఆర్ఎస్ ప్రతినిధి బృందం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు విజ్ఞప్తి చేసింది.

-----------------------------

**మున్సిపల్ ఎన్నికలు**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. 7 మున్సిపల్ కార్పొరేషన్లు,, 116 మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ రోజు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమీక్ష అనంతరం వెలువడిన ఈ నోటిఫికేషన్ తో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ ఎన్నికల ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. షెడ్యూల్ ప్రకారం.. రేపటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 31న నామినేషన్ల పరిశీలన, వచ్చే నెల 3న ఉపసంహరణకు

గడువుగా నిర్ణయించారు. అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. వచ్చే నెల 11న పోలింగ్ నిర్వహించి, 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్ల ఎన్నిక పరోక్ష పద్ధతిలో జరగనుంది. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎన్నికల కమిషనర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**బైట్ ఎన్నికల కమిషనర్**

**HYD -PTC**

**----------------------------**

**పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గడిచిన పదేళ్లలో స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై ఈరోజు సచివాలయంలో అధికారులతో సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని చెప్పారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

**జీఎస్**

----------------------------

**శ్రీధర్ బాబు**

"ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల మధ్య జరిగే ప్రతి చర్చకు రాజకీయాలను ఆపాదిస్తూ విష ప్రచారం చేయడం తగదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంత్రుల సమావేశంపై సోషల్ మీడియా, ప్రసార

మాధ్యమాల్లో జరుగుతున్నదంతా అసత్య ప్రచారమని ఆయన ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాసంలో మంత్రులం పాలనాపరమైన అంశాలను చర్చించామని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరఫున అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించామని అన్నారు.

**జీఎస్**

---------------------------

**తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మం  సర్వతోముఖాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ రోజు ఖమ్మంలో పలు అభివృద్ధి కార్యక్రమాలరకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ...

**బైట్ తుమ్మల నాగేశ్వరరావు**

**పీటీసీ - ఖమ్మం**

---------------------------

**వివేక్ వెంకటస్వామి**

మంచిర్యాల జిల్లాలోని ఆర్కే 5 సింగరేణి గని శ్రీరామ్ పూర్ డివిజన్ పరిధిలోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడినట్లు రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ రోజు చెన్నూరు మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరు మున్సిపాలిటీనీ మోడల్ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు.

**పీటీసీ - మంచిర్యాల**

-------------------------------

**వింగ్స్ ఇండియా 2026**

ఆసియాలోనే అతిపెద్ద పౌర విమానయాన కార్యక్రమమైన వింగ్స్ ఇండియా 2026 కార్యక్రమం రేపు హైదరాబాద్ లో ప్రారంభం కానుంది. ఫిక్కీ సహకారంతో పౌర విమానయాన శాఖ

ఆధ్వర్యంలో రేపటి నుంచి నాలుగు రోజుల పాటు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో ఈ ప్రదర్శన జరగుతుంది. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు రేపు ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారు. ప్రారంబోత్సవ కార్యక్రమంలో రాష్ట్రఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారు. ఈ కార్యక్రమ ముందస్తు సన్నాహకాల్లో భాగంగా భారత వైమానిక దళానికి చెందిన సూర్య కిరణ్ ఎరోబాటిక్ బృందం ఈ రోజు విన్యాసాలకు సంబంధించిన రిహార్సల్స్ ప్రారంభించింది. వింగ్స్ ఇండియా 2026 కార్యక్రమం ద్వారా ప్రపంచ విమానయాన పర్యావరణ వ్యవస్థలోని కీలక భాగస్వాములను ఒకచోట చేర్చి, అంతర్జాతీయ పౌర విమానయానంలో భారతదేశం పాత్రను ఇనుమడింపజేయనుంది. ఇందులో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్, స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ డిస్‌ప్లేలు, ఏరోబాటిక్ ఫ్లయింగ్ షోలు, గ్లోబల్ ఏవియేషన్ కాన్ఫరెన్స్, మినిస్టీరియల్ ప్లీనరీ సెషన్‌లు , గ్లోబల్ CEOల ఫోరమ్, ఏవియేషన్ జాబ్ ఫెయిర్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. 'ఇండియన్ ఏవియేషన్ పేవింగ్ ద ఫ్యూచర్' అనే ఇతివృత్తంతో 'వింగ్స్ ఇండియా 2026' కార్యక్రమం జరగనుంది. ఈ ఏడాది ప్రదర్శనలో విమానాల తయారీ, డిజైన్, నిర్వహణ, భద్రత వంటి కీలక అంశాలు ఉంటాయి. యువత కోసం ఏవియేషన్ జామ్ మేళా, స్టూడెంట్స్ కోసం 'సివిల్ ఏవియేషన్ ఇన్నోవేషన్ చాలెంజ్'ను కూడా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

**జీఎస్**

------------------------------

**బీఆర్ఎస్ బృందం**

సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాల్లో కాంగ్రెస్ నేతల పాత్రపై విచారణ జరిపించాలంటూ బీఆర్ఎస్ ప్రతినిధి బృందం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు విజ్ఞప్తి చేసింది. ఆ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఈ సాయంత్రం గవర్నర్ ను కలిసి ఈ మేరకు విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది. ఇటీవలి కాలంలో జరిగిన పరిణామాలు, క్యాబినెట

మంత్రుల మధ్య విభేధాలు, సైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దు వంటి అంశాలను గవర్నర్ కు వివరించారు.

**జీఎస్**

--------------------------------

**బిజెపి ధర్నా**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ, బిజెపి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ లో ఈ రోజు భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా.. రాంచందర్ రావు మాట్లాడుతూ.... ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం బిజెపి చేపట్టిన ఈ ఉద్యమం కేవలం రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రమే కాకుండా, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలకూ సంబంధించినదన్నారు. తెలంగాణ రాష్ట్రం సాకారమైతే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని ఆశించారని, కానీ కనీసం రిటైర్డ్ ఉద్యోగులకు కూడా బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు.

**జీఎస్**

---------------------------------

**ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి**

జీ రామ్ జీ ఉపాధి హామీ పథకం పూర్తిస్థాయిలో అమలైతే పంచాయతీ రాజ్ సిద్ధాంతాలు బలపడి గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చేవెళ్ల పార్లమెంట సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఈరోజు వికారాబాద్ జిల్లా వీర్ శెట్టిపల్లి గ్రామంలో జీ రామ్ జీ పథకం పై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

**పీటీసీ – వికారాబాద్**

---------------------------------

**మంత్రులతో ఎమ్మెల్యే చర్చ**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఈరోజు ఉదయం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణ పురోగతి, రైతుల సమస్యలపై చర్చించారు.

**పీటీసీ - యాదాద్రి భువనగిరి**

-------------------------------

**బిజెపి మహిళా మోర్చా**

మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయడం కోసం ఈ రోజు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు, రాజస్థాన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎన్నికల కో-ఇన్‌చార్జ్ అశోక్ పర్ణామి, రాజ్యసభ సభ్యులు రేఖా శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల్లో వ్యూహాలను సమీక్షించడంతో పాటు, పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యాచరణను అమలు చేయడం, పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రచారం చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు దిశానిర్దేశం చేశారు.

**జీఎస్**

-----------------------------

**మేడారం ప్రత్యేక బస్సులు**

రేపటి నుండి ఈ నెల 31 వరకు జరిగే మేడారం జాతరకు ఆసిఫాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. బెల్లంపల్లి నుండి 79, ఆసిఫాబాద్ నుండి 10 ప్రత్యేక బస్సులు ప్రారంభం అయ్యాయన్నారు. ఈ

బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**ఆసిఫాబాద్ - పిటిసి**

------------------------------

**ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

నాగర్ కర్నూల్ పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని పలు వార్డులలో కొత్త సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ప్రారంభించారు. అవసరం ఉన్న కాలనీల్లో కొత్త నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలోనే నాగర్ కర్నూల్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందు వరుసలో నిలబెడతానని, అత్యధిక నిధులు తీసుకువచ్చి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని అన్నారు.

**పీటీసీ – నాగర కర్నూల్**

-----------------------------

**మున్సిపల్ ఎన్నికలు**

మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**పిటిసి - రాజన్న సిరిసిల్ల**

------------------------------

**బ్రెస్ట్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్**

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొబైల్ వాహనం ద్వారా మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి ప్రావీణ్య, జిల్లా వైద్యాధికారి వసంతకుమార్ తెలిపారు. ఈ వాహనం ప్రతి గ్రామంలో పర్యటిస్తూ 30 సంవత్సరాలు పైబడిన మహిళలందరిలో బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ మమోగ్రఫీ, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

**SANGAREDDY PTC**

------------------------------

**కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

వికారాబాద్ జిల్లాలో రైతుల సౌకర్యార్థం నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్ఫెడ్ ద్వారా ఏడు కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ తహిమీనా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 7 కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన కందులకు క్వింటాలుకు 8 వేల రూపాయల కనీస మద్దతును చెల్లించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

**పీటీసీ – వికారాబాద్**

--------------------------------